క్లుప్తంగా

ఉపాధి కూలీల వేతనాల జమ



అక్కిరెడ్డిగూడెంలో మస్తర్లు వేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ కొండపల్లి ఏడుకొండలు

దెందులూరు: రజాతీయ ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు జమయ్యాయని గాలాయగూడెం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కొండపల్లి ఏడుకొండలు తెలిపారు. బుధవారం గ్రామంలోని చెరువులో నాలుగు గ్రూపులుగా 120 మంది ఉపాధి పని చేశారు. ఇప్పటి వరకు చేసిన మూడు వారాల పనికి వారి ఖాతాల్లో రోజుకు రూ.270, 280 చొప్పున వేతనం జమయ్యిందన్నారు. మేట్ రమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్ ఉపాధి పనులను పరిశీలించారు.

శ్రవణ నక్షత్ర విశేష పూజలు



విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

భీమడోలు: గుండుగొలను వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వార్లకు శ్రవణ నక్షత్ర ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో పూజారులు మంగతి ఆచార్యులు, రవి అచార్యులు శాస్త్రోక్తంగా స్వామి వారికి విశేష పూజలు చేశారు. స్వామి వారిని సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి, పెద్దలు వగ్వాల అచ్యుతరామారావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి పరామర్శ



సతీష్‌ను పరామర్శిస్తున్న ఘంటా ప్రసాదరావు

పెదపాడు : మండలంలోని వడ్డిగూడెం గ్రామానికి చెందిన ఘంటసాల సతీష్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు ఆసుపత్రికి వెళ్లి సతీష్‌ను పరామర్శించారు. అనంతరం డాక్టరుతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ నాయకుడు పామర్తి అచ్యుత్‌గౌడ్ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి చామంతులతో పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో అభయాంజనేయస్వామికి బుధవారం 1008 చామంతి పూలతో ప్రత్యేక పూజలు జరిపారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, పద్మావతి దంపతులు పాల్గొని స్వామివారికి చామంతి పూలు, తమలపాకులతో ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజామునుంచి దేవాలయ అర్చకులు సుప్రభాతసేవ, అర్చనలు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత మోహన్‌రావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా బుధవారం రూ.2 లక్షలను విరాళంగా అందజేశారు. అందులో భాగంగా భీమవరం మండలం నరసయ్య అగ్రహారానికి చెందిన సోడిశెట్టి వీరవెంకట మోహన్‌రావు రూ.1,00,111 ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. అలాగే గన్నవరానికి చెందిన ఒ.మోహన రంగారావు రూ.లక్ష నిత్యాన్నదాన కార్యాలయంలో జమచేయగా, ఆలయ సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ క్యాంప్



పెరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు



రైఫిల్ షూటింగ్‌లో పాల్గొన్న క్యాడెట్లు



డైమండ్ షూటింగ్, మెలకువలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- జిల్లా వ్యాప్తంగా 501 మంది విద్యార్థులు హాజరు
- షూటింగ్‌లో అదరగొట్టిన క్యాడెట్లు
- వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

పెదవేగి: పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయంలో గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంప్ ఉత్సాహంగా సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 501 మంది విద్యార్థులకు ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ ఎం వెంకటరత్నం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడంతోపాటు వివిధ రకాల ఉద్యోగాల్లో, కళాశాల అడ్మిషన్‌లలో ప్రాధాన్యత కల్పిస్తారు. శిక్షణలో భాగంగా రైఫిల్ షూటింగ్, డ్రిల్, దేశ సరిహద్దుల్లో ఆర్మీ శిబిరాలు ఏ విధంగా ఉంటాయో కళ్లకు కట్టినట్లు చూపించి కేడెట్స్‌కు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీలో శిక్షణ ద్వారా దేశభక్తి, నైతిక విలువలు పెంపొందింపజేయడం, క్రమశిక్షణ, సాయం చేసే తత్వం అలవడతాయని అధికారులు పేర్కొంటున్నారు.



రైఫిల్ షూటింగ్ కోసం ఆయుధాలు

ఏ రంగంలోనైనా రాణించవచ్చు



ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్ని పాఠశాలల్లో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ కచ్చితంగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో ప్రతి విద్యార్థికి చదువుతోపాటు, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ స్కిల్స్, వివిధ రకాల నైపుణ్యాలపై నిపుణులచే అవగాహన కల్పిస్తున్నాం. విద్యతోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు.

– సౌరబ్ ముఖర్జీ ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్

క్యాంప్ చక్కగా ఉపయోగపడుతుంది



యువతకు సరైన రీతిలో శిక్షణ ఇచ్చి విలువలతో కూడిన విద్య అందించడంతోపాటు దేశరక్షణలో వారి పాత్రను తెలియజేసేందుకు ఇటువంటి క్యాంప్‌లు ఉపయోగపడతాయి. ఆర్మీలో రక్షణ దళం ఎలా పనిచేస్తుంది, రోప్‌తో చేసే విన్యాసాలు, రైఫిల్ షూట్ ఇలా అనేక అంశాలపై అవగాహన కల్పించాం. ఈ క్యాంప్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థుల మధ్య మంచి వాతావరణం నెలకొల్పడం జరిగింది. ఎంహెచ్ఎస్ శేఖర్ కుమార్, ఫస్ట్ ఆఫీసర్, భీమవరం

ఆర్మీలో చేరాలనేది నా లక్ష్యం



ఆర్మీలో చేరాలనేది నా లక్ష్యం. దేశ రక్షణలో సుబాష్‌చంద్రబోస్ ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవ చేస్తా. ఈ క్యాంప్‌లో ఫైరింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం, ఐకమత్యం, క్రమశిక్షణ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు.

– కె ఝాన్సీ, ఎస్‌కేఎస్‌టీ కళాశాల, తణుకు

ప్రోత్సాహం బాగుంది



నేను తొమ్మిదో తరగతి చదువుతున్నాను. ప్రస్తుతం బి సర్టిఫికెట్ చేస్తున్నాను. ఢిల్లీ పెరడ్ చేయాలని, ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో మంచి ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. మా ఎన్‌సీసీ ఆఫీసర్ నాకు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారు.

జి.మోక్షిత్ సాయిజగన్, సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్, ఏలూరు

ఉన్నతంగా ఎదగడానికి దోహదం



నేను ఐదు క్యాంప్‌లో పాల్గొన్నా. ప్రస్తుతం పెదవేగిలో 10 రోజులపాటు నిర్వహిస్తున్న క్యాంప్ ఎంతో ఉత్సాహంగా జరుగుతుంది. ఇలాంటి శిక్షణా తరగతులు విద్యార్థి జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి ఎంతో చక్కగా ఉపయోగపడతాయి.

– ఎల్ కూషేంద్రకుమార్, కెడెట్, భీమవరం

క్రమశిక్షణతో విజయాలు



ఈ క్యాంప్‌లో క్రమశిక్షణ, స్కిల్స్ శ్రద్ధగా నేర్పిస్తున్నారు. ఆత్మస్థైర్యంతో ఏ విధంగా ముందుకు వెళ్లాలో చెప్పారు. సమయం సద్వినియోగం చేసుకోవడం నైతిక విలువలతో జీవించడం వంటి ఎన్నో విషయాలు నేర్పుతున్నారు. క్రమశిక్షణతో విజయాలు సాధించవచ్చని అర్థమైంది.

– ఎం వెంకట మౌనిక, సెయింట్ థెరిస్సా కళాశాల ఏలూరు

తొలి రోజే 'జగనన్న విద్యా కానుక'

- విద్యారంగానికి పెద్దపీట వేసిన సీఎం జగన్
- పాఠశాల పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు అందించేలా చర్యలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో విద్యార్థులు (ఫైల్)



దెందులూరు: ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. అనేక విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తూ నాడు-నేడు మన బడి పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేశారు. విద్యతోనే ప్రతి ఒక్కరి అభివృద్ధి ముడిపడి ఉందని గట్టిగా నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేశారు. గత టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా విస్మరించడంతో అనేక పాఠశాలలు మూతపడ్డాయి. అంతేకాకుండా టీడీపీ హయాంలో పాఠశాలలు పునఃప్రారంభమైన ఐదారు నెలలకుగానీ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందేవికావు. అందుకు విభిన్నంగా జగన్ ప్రభుత్వం పాఠశాల ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తుంది. జగనన్న విద్యాకానుక పంపిణీలో భాగంగా నవంబరు నుంచి జనవరి వరకు విద్యార్థుల వివరాలు, బూట్లు, యూనిఫామ్ కొలతలు సేకరించారు. ఇప్పటి వరకు విద్యార్థులందరికీ విద్యా కానుక అందజేశారు.

జగనన్న విద్యా కానుక సిద్ధం

ధనిక వర్గాల విద్యార్థులతో పాటు పేద విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం ఏమాత్రం సడలకుండా సత్ఫలితాలు సాధించడమే జగనన్న విద్యాకానుక లక్ష్యం. దీని కోసం విద్యా కానుకగా ప్రతి ఏటా విద్యార్థులకు యూనిఫామ్, షూస్, టై, బెల్ట్, నోటు పుస్తకాలు, డిక్షనరీలు, 2019 నుంచి పాఠశాల పునః ప్రారంభం రోజే అందించేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గం వారీగా విద్యార్థుల వివరాలు

మండలం	బాలురు	బాలికలు	మొత్తం
దెందులూరు	2051	2302	4353
పెదపాడు	1981	2659	4640
పెదవేగి	3810	3136	4946
ఏలూరు రూరల్	7060	8107	15167

పంపిణీకి సర్వం సిద్ధం



కలెక్టర్, డీఈవో ఆదేశాల మేరకు పాఠశాల పునఃప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. జగనన్న విద్యాకానుక కిట్లు మండల కార్యాలయాల నుంచి పాఠశాలలకు చేరాయి. పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యాకానుక అందజేస్తాం.

– రంగయ్య, ఎంఈవో, ఏలూరు రూరల్

విద్యా కానుక సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులు జగనన్న విద్యాకానుక కిట్లను సద్వినియోగం చేసుకోవాలి. గతంలో ఎప్పుడూ ఈ విధంగా పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యా కానుక కిట్లు పంపిణీ జరగలేదు. భవిష్యత్తులో విద్యార్థులకు మరింత మంచి జరుగుతుంది.

– శ్రీనివాస్, తెలుగు పండిట్, గోపన్నపాలెం ఉన్నత పాఠశాల

సీఎం జగన్ విద్యా రంగానికి దిక్సూచి



విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన గొప్ప వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. పేదరికంతో ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదని, తల్లిదండ్రులకు చిన్నారుల విద్యాబాధ్యతలు భారం కాకూడదని భావించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్ద పీట వేసి పేద, బడుగు, బలహీన వర్గాల పాలిట దేవుడిగా నిలిచారు.

– కోటే నాగమల్లేశ్వరి కుమార్, గ్రామ సర్పంచ్, గోపన్నపాలెం

2న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

దెందులూరు: కొవ్వలిలో జూన్ 2న ఉపాధ్యాయుడు దివంగత గొరిపర్తి హరికృష్ణ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ప్రతిభ గల విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామని గొరిపర్తి వెంకట రామకృష్ణ తెలిపారు. కొవ్వలి భక్తాంజనేయ ఆలయ ప్రాంగణ కమ్యూనిటీ హాలు (యాదవనగర్)లో 2న అమ్మ సోషల్ థాట్ ఫౌండేషన్ పర్యవేక్షణలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, వృద్ధులకు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు.

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి



వంటకాల్లో ప్రతిభ కనబరచిన కార్మికులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

పెదవేగి : మధ్యాహ్న భోజనం రుచిగా, శుభ్రంగా ఉన్నట్లయితే విద్యార్థులు పాఠశాలలో భోజనం చేయడానికి ఇష్టపడతారని ఎండీఎం కోఆర్డినేటర్ గౌస్ మోహిద్దిన్ తెలిపారు. బుధవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవో-2 వి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు విద్యార్థులకు భోజనం తయారు చేసే విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ఆరు కాంప్లెక్స్‌ల పరిధిలో వారికి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట రమణ, ఎంఈవో బుధవ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు



బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి

దెందులూరు: జూన్ 4న ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి బీ లావణ్యవేణి అన్నారు. బుధవారం దెందులూరు ఆర్వో కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కౌంటింగ్ సెంటరులో 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 14 రౌండ్లు కౌంటింగ్ జరుగుతుందన్నారు. ప్రతి రౌండ్ కౌంటింగ్ సమాచారాన్ని మీడియా సెంటరుకు అందిస్తామన్నారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ మూడంచెల భద్రతా వలయం, కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలు, ఆర్మ్‌డ్ పోలీసులతో బందోబస్తు, సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణలో ఉందన్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిసరాల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని తెలిపారు. నెలాఖరు లోపు రాజకీయ పార్టీలు ఇచ్చిన జాబితాలో నేరచరిత్ర లేని వారిని 17 మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా పోలీస్‌శాఖ వారి దర్యాప్తు అనంతరం అనుమతిస్తామన్నారు. కౌంటింగ్ విధులకు హాజరయ్యే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామని జాయింట్ కలెక్టర్, ఆర్వో లావణ్యవేణి వివరించారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులకు శిక్షణ అందిస్తున్న జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ టీవీ ఉమామహేశ్వరరావు

భీమడోలు: ఒక మంచి పుస్తకం వందమంది మిత్రులతో సమానమని, అలాంటి పుస్తకాలకు నిలయమైన గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం వేసవి శిక్షణ తరగతులు ఉల్లాసభరిత వాతావరణంలో సాగుతున్నాయి. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు చందన చెప్పింది.. వందన మారింది అనే నీతి కథను వివరించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచి రామాయణం, మహాభాగవతం వంటి గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పూళ్ల, గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరులో 2న సంగీత విభావరి

ఏలూరు (టూటౌన్): ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం 78వ జయంతి సందర్భంగా జూన్ 2వ తేదీ ఆదివారం ఏలూరులో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు హేలాపురి సింగర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్ నందు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో దీనికి సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్ రవి,కోశాధికారి యు.రవిశంకర్, కమిటీ నాయకులు పి.సూర్యప్రకాష్, కె.శ్రావణ కుమారి మాట్లాడుతూ ఏలూరు వైఎంహెచ్ఏ హాల్ నందు జూన్ 2వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పాటల పల్లకి పేరు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 40 పాటలతో గాయకులు పాల్గొనేలా కార్యక్రమం రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: పోతునూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల రీత్యా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేబీబీ నటరాజన్ తెలిపారు. పోతునూరు, ఉండ్రాజవరం, కేతవరం, కొవ్వలి, దోసపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఓట్లు లెక్కింపు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో ఖాజావల్లీ

ఉంగుటూరు: కౌంటింగ్‌లో సిబ్బంది నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్వో ఎస్‌కే ఖాజావల్లీ స్పష్టం చేశారు. బుధవారం ఉంగుటూరు పోలింగు కేంద్రంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణా సమావేశం నిర్వహించారు. పోస్టల్ ఓట్ల లెక్కింపులో కవర్లు తెరిచినపుడు ఓటు ఎవరికి వేశారనే విషయం బహిర్గతం చేస్తే నిబంధనలు అతిక్రమించినట్లేనని వారిపై వేటు తప్పదన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు క్యూఆర్ కోడ్ ఉంటుందన్నారు. జూన్ 4న ఉదయం 6 గంటలకు సిబ్బంది కౌంటింగు కేంద్రానికి రావాలని ఆర్వో ఖాజావల్లీ తెలిపారు. అసెంబ్లీ ఈవీఎంలు తెచ్చే సిబ్బంది పింక్ కలరు షర్టులు, పార్లమెంటు ఈవీఎంలు తెచ్చే సిబ్బంది తెలుపు రంగు షర్టులు ధరించి ఉంటారని తికమక పడరాదన్నారు. ఏకకాలంలో 14 ఈవీఎంలు, 14 టేబుళ్ల వద్దకు తీసుకెళ్లాలన్నారు. కౌంటింగు సమయంలో వెలువడుతున్న ఫలితాలను బట్టి సిబ్బంది హావభావాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్వో తెలిపారు. సమన్వయంతో సిబ్బంది పనిచేయాలని, ఉదయం 6 గంటలకు రాజకీయ అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగురూం ఓపెన్ చేస్తామని ఆర్వో తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు ఏఎస్‌కేవీ శివయ్య, జీ వరహాలయ్య, కే పోసిబాబు, వై.రాంబాబు, ఎంపీడీవోలు డీఎస్ఎస్ శర్మ, టీ స్వర్ణలత, జీఎస్ రామకృష్ణయ్య, కే సూర్యనారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

ఉంగుటూరు: ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆర్వో ఎస్‌కే ఖాజావల్లీ తెలిపారు. బుధవారం స్థానిక ఆర్వో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 4న 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. 14 టేబుళ్లపై 16 రౌండ్లు లెక్కింపు పూర్తి చేస్తామన్నారు. కౌంటింగ్ మధ్యాహ్నం 2 గంటలకు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఒక రౌండులో ఈవీఎం మొరాయించినా మిగతా రౌండ్లు ఆలస్యం చేయమని, అటువంటి ఈవీఎంలను చివర లెక్కిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 1,81,113 ఓట్లు పోలయ్యాయని, పోస్టల్ బ్యాలెట్లు ఓట్లు 1704, ఈటీపీబీఎస్ ఓట్లు 85 వచ్చాయని తెలిపారు. కౌంటింగ్ ప్రారంభానికి ముందే ఈటీపీబీఎస్ ఓట్లు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రౌండుకు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఒక్కో టేబుల్‌కు 12 మంది ఏజెంట్లకు ఏర్పాటు చేశామని ఆర్వో ఖాజావల్లీ తెలిపారు. ఏజెంట్లు 4న 7 గంటలకు కౌంటింగు హాలుకు చేరుకోవాలని సూచించారు. ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ విభాగం డ్రాయింగ్ హాలు నెం 5లో లెక్కింపు జరుగుతుందన్నారు.